
న్యూనల్లకుంటలోని శ్రీసీతారామాంజనేయ సరస్వతి దేవాలయంలో సీతారాముల కల్యాణ వేడుకల్లో భక్తులు


కాచిగూడలో శ్రీ సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి


అంబర్‌పేట పటేల్‌నగర్‌లో శ్రీరామ నవమి వేడుకల్లో ఎమ్మెల్యే, కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌లు


కల్యాణంలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠాజైసింహ

కల్యాణ వైభోగమే..


నింబోలిఅడ్డలోని శ్రీరాముల దేవాలయంలో పూజలు చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్


నెహ్రూనగర్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మానేకర్ చంద్రుబాబా

లోకాభిరాముడి కల్యాణం.. ప్రతిఇంటా వేడుకే. వేద పండితుల మంత్రోచ్ఛారణ.. బాజాభజంత్రీలు.. వాడవాడలా సంబరాలు. శ్రీరామనవమిని పురస్కరించుకొని బుధవారం సీతారాముల కల్యాణం కన్నులపండువగా జరిగింది. దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కాచిగూడ తుల్జాభవన్‌లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, తుల్జాభవన్ ఈవో అంజనారెడ్డ పాల్గొన్నారు. న్యూనల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి దేవాలయంలో ఉదయం సీతారామచంద్రులకు ప్రత్యేక పూజలు కావించారు. దేవాదాయ శాఖ, భక్తుల తరపున స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. చిక్కడపల్లిలో జరిగిన శ్రీరామ కల్యాణోత్సవంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

–అంబర్‌పేట/కాచిగూడ/నల్లకుంట/సుందరయ్యవిజ్ఞానకేంద్రం




శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నేతలు ఎ.సూర్యప్రకాష్ సింగ్, సి.నందకిషోర్ యాదవ్ తదితరులు


తుల్జాభవన్‌లో శ్రీసీతారాముల కల్యాణవేడుకలు


అంబర్‌పేటలో శ్రీరామనవమి వేడుకల్లో బీజేపీ నేత ఆనంద్‌గౌడ్ తదితరులు


గోల్నాకలోని శ్రీరామనవమి వేడుకల్లో అన్నదాన కార్యక్రమంలో కార్పొరేటర్ లావణ్య శ్రీనివాస్‌గౌడ్


ఛే నంబరు చౌరస్తాలోని రామలయంలో అమ్మవారి మంగళసూత్రంతో పూజారి


శ్రీ సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు


అడిక్‌మెట్ అభయాంజనేయ స్వామి దేవాలయంలో మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు


బాకారంలో జరిగిన సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు తదితరులు


ఛే నంబరు చౌరస్తాలో శ్రీరామ నవమి వేడుకల్లో కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు రోహిణ్‌రెడ్డి


దోమలగూడలోని బాలత్రిపుర సుందరిదేవి ఆలయంలో కార్పొరేటర్ రచనశ్రీ, రవీందర్, వెంకటేష్ తదితరులు


బాగ్‌లింగంపల్లిలోని హనుమాన్ దేవాలయంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యేను సత్కరిస్తున్న దృశ్యం


చిక్కడపల్లిలో హనుమాన్ దేవాలయంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో కార్పొరేటర్ రవిచారి


సీతారాముల కల్యాణంలో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాగేష్‌ముదిరాజ్ తదితరులు


చూడముచ్చటగా జరిగిన రాములోరి కల్యాణంలో భక్తులు

కృష్ణప్రదీప్ అకాడమీ నుంచి నలుగురికి సివిల్స్ ర్యాంకులు


363వ ర్యాంకు సాధించిన సమీక్షాజాను సన్మానిస్తున్న కృష్ణప్రదీప్, భవానీశంకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యూపీఎస్సీ పరీక్షల్లో కృష్ణప్రదీప్ 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ నుంచి నలుగురు ర్యాంకులు సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ కృష్ణ ప్రదీప్, చీఫ్ మెంటర్ డాక్టర్ సి.హెచ్.భవానీశంకర్ తెలిపారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ అకాడమీలో శిక్షణ పొందిన వారిలో షాహీదర్శిని 112వ ర్యాంకు, ధీరజ్‌రెడ్డి 173వ ర్యాంకు, సమీక్షజా 362వ ర్యాంకు, నాగసంతోష్ అనుష 818వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. కేపీఐఏఎస్‌గా ప్రసిద్ధి చెందిన ఈ అకాడమీ ఢిల్లీ, హైదరాబాద్ బ్రాంచీలలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అనేకమందిని ఐఏఎస్, ఐపీఎస్ ఇతర సర్వీసులకు పంపడంలో గత 20 ఏళ్లుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

సివిల్స్‌లో 'శరత్‌చంద్ర అకాడమీ' సత్తా




780 ర్యాంక్ సాధించిన ఉదయ్‌కృష్ణారెడ్డి, 5వ ర్యాంకర్ రుహానీతో శరత్‌చంద్ర

చిక్కడపల్లి: సివిల్స్ ఫలితాల్లో శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ హైదరాబాద్, విజయవాడ బ్రాంచీలు అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. అనన్యరెడ్డికి ఆలిండియా 3వ ర్యాంక్, రుహానికి 5వ ర్యాంకు, అదేవిధంగా 18, 19, 42, 61, 91లతోపాటు మొత్తంగా 50కి పైగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ వంటి ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని సంస్థ డైరెక్టర్ శరత్‌చంద్ర తెలిపారు. ఇందులో 19 ర్యాంకులు తెలుగు విద్యార్థులకు వచ్చాయని, మిగిలినవి తమ ఆన్‌లైన్ క్లాసెస్, ఢిల్లీ బ్రాంచి టెస్ట్ సిరీస్ ఇంటర్వ్యూ గైడెన్స్ నుంచి వచ్చాయని పేర్కొన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వారికి, మహిళా అభ్యర్థులకు అత్యధికంగా ర్యాంకులు రావడం ఆనందంగా ఉందని చెప్పారు. ఏపీలోని సింగరాయకొండకు చెందిన ఉదయ్‌కృష్ణారెడ్డికి 780 రావడం గమనార్హమని అన్నారు. సీఐ అవమానించడంతో ఉదయ్‌కృష్ణారెడ్డి కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసి పట్టుదలతో చదివి ఈ ర్యాంకు సాధించారన్నారు.

నామినేషన్లకు రెడీ!

నేటి నుంచి స్వీకరణ

- సికింద్రాబాద్‌లో రెడ్ అలర్ట్
- ప్రతి కదలికా వీడియో రికార్డింగ్

సికింద్రాబాద్: త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ఈనెల 18 (నేడు) నుంచి ప్రారంభం కానుంది. 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ, పరిశీలన వంటి కార్యకలాపాలు నిర్వహించేందుకు సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ నార్త్‌జోన్ కమిషనర్ కార్యాలయాన్ని ఎన్నికల కార్యాలయంగా ఎంపిక చేశారు. నామినేషన్ల స్వీకరణ కోసం జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం మొదటి అంతస్తులో అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పర్యవేక్షణలో సహాయక రిటర్నింగ్ అధికారి వీరారెడ్డి నేతృత్వంలో నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుంది.

కంట్రోల్‌రూం ఏర్పాటు...

ఎంపీ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించడం, స్వీకరించిన మీదట అభ్యర్థుల ముందే ప్రాథమిక పరిశీలన చేసేందుకు ఎన్నికల విభాగం కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. ఈ నెల 19న బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి జీ.కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ తదితరులు నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 21, 23 తేదీల్లో మరికొందరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. నామినేషన్లు మొదలు, ప్రచార సరళి పూర్తయ్యే వరకు మొత్తంగా ప్రతీ కదలికను వీడియో రికార్డు చేస్తున్నామన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

భక్తిని నింపిన 'అంతా రామమయం'


సీతామహాలక్ష్మి లలితలను సన్మానిస్తున్న శివప్రసాద్, త్రినాథరావు

చిక్కడపల్లి: కమలాకర చారిటబుల్ ట్రస్ట్, శ్రీకమలాకర లలిత కళాభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతారామమయం సంగీత కార్యక్రమం శ్రోతల్లో భక్తిని నింపింది. బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన కార్యక్రమంలో సంగీత కళాకారిణి వై.రమాప్రభ ఆధ్వర్యంలో సమ్మోహన స్కూల్ ఫర్ వోకల్ మ్యూజిక్ వారు ఆలపించిన రాముని భక్తి గీతాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆధ్యాత్మిక రంగ ప్రముఖులు గిడుగు సీతామహాలక్ష్మి, లలితలను ఈలపాట విద్వాంసులు కొమరవోలు శివప్రసాద్, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం త్రినాథరావు సన్మానించారు. సినీ దర్శకుడు గోపాలకృష్ణ, నిర్వాహకులు భారతీ కమలాకర్, శోబాల్, కాంతికృష్ణ, స్వర్ణ పాల్గొన్నారు.

ఐదు రూపాయలకే మరో ఐదేళ్లా: గౌరీ సతీష్

బీజేపీపై టీపీసీసీ ధ్వజం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేయడాన్ని తన మొట్టమొదటి విజయంగా బీజేపీ తన మేనిఫెస్టోలో పేర్కొనడం విడ్డూరంగా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. మళ్లీ గెలిస్తే ఉచిత రేషన్ ఇస్తామని మొదటి హామీ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌరీసతీష్ మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా అర్హులందరికీ రూపాయికే కేజీ బియ్యం ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రతి నెలా ఐదు రూపాయల మేర కేంద్రం ఉచితంగా అదనపు లబ్ధి చేకూరుస్తోందన్నారు. ఐదు రూపాయల ప్రయోజనాన్ని చూపిస్తూ మరో ఐదేళ్లపాటు పాలించే అవకాశాన్ని ఇవ్వాలని బీజేపీ కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆహార భద్రత చట్టం, విద్య చట్టం, అటవీ హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం ఇలా అనేక చట్టాలు తీసుకువచ్చిందన్నారు.

19, 20 లలో
భౌతిక, గణితశాస్త్రాల పురోగతులపై జాతీయసదస్సు


సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరస్పర ఆధారిత భౌతిక, గణిత శాస్త్రాలలో ఇటీవలి పురోగతులపై ఈ నెల 19, 20 తేదీలలో జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొని, వారి పరిశోధనాపత్రాలను సమర్పించనున్నారు. ఈ సదస్సుకు ప్రత్యేక వక్తలుగా ఆంధ్రప్రదేశ్ కాలేజ్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.బాబులతోపాటు వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ ఉన్నత విద్యావిభాగం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కమీషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ బుర్రా వెంకటేశం, తెలంగాణ విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఉస్మానియా యూనివర్సిటీ, సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ డి.కరుణాసాగర్ పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య కార్యక్రమ కరపత్రాన్ని విడుదల చేసి సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనితా అబ్రహం, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ బంగ్లాభారతి, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎస్.నిర్మల, సదస్సు కన్వీనర్లు డాక్టర్ జె.చిన్నబాబు, డాక్టర్ మల్లీశ్వరి, సహ కన్వీనర్లు బి.విజయనిర్మల, ఎల్.విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

రామరాజ్య స్థాపనకు రాష్ట్ర భృత్ మహాయజ్ఞం


రాష్ట్ర భృత్ మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కాచిగూడ: ఆర్యసమాజం ఇసామియా బజార్ ఆధ్వర్యంలో బుధవారం కాచిగూడ, చెప్పల్‌బజార్‌లో రామరాజ్య స్థాపన సంకల్పంతో 'రాష్ట్రభృత్ మహాయజ్ఞం' నిర్వహించారు. 250 మంది దంపతులు ఈ మహాయజ్ఞంలో పాల్గొని యజ్ఞవేదుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆచార్య సవిత, ఆచార్య మైత్రేయ, ఆచార్య ధర్మవతి, గురుకుల విద్యార్థినుల వేద మంత్రాలతో ఈ వేడుకలు జరిగాయి. యజ్ఞానంతరం ఇసామియాబజార్ ఆర్యసమాజం వద్ద ప్రారంభమైన శ్రీ రామనవమి శోభాయాత్ర చెప్పల్‌బజార్, లింగంపల్లి చౌరస్తా, కాచిగూడ చౌరస్తా మీదుగా ఆర్యసమాజ్ సుల్తాన్‌బజార్ వరకు చేరుకుంది. కార్యక్రమంలో మహర్షి దయానంద సరస్వతి జయంతి ఉత్సవ కమిటీ ప్రతినిధులు డాక్టర్ ధర్మతేజ, ఆర్యసమాజ్ అధ్యక్షుడు ధర్మపాల్, అఖండ భారత్ సేన అధ్యక్షుడు విజయ్ పాల్, సత్యపాల్, అశ్విన్ యాదవ్, అజయ్ పాల్, యష్‌పాల్, మల్లిక, అభినవ్ మిత్ర తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్ర రూట్ పరిశీలన

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు


శోభాయాత్ర రూట్‌లో పరిశీలిస్తున్న డీసీపీ ఆకాన్ష్ యాదవ్, ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి: ఈ నెల 23న జరిగే హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్నిజాగ్రత్తలు తీసుకుంటున్నామని ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపారు. ఈ నెల 23న శోభాయాత్ర సాగుతున్న నేపథ్యంలో ప్రధాన కూడలి అయిన ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి, అశోక్‌నగర్, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాన్ష్‌యాదవ్, చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సీతయ్యలు పోలీసు సిబ్బందితో కలసి బుధవారం పర్యటించారు. నారాయణగూడ బ్రిడ్జి వద్ద ప్రారంభమైన పరిశీలన బైబిల్ హౌస్ వరకు కొనసాగిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ పాదయాత్ర పరిశీలనలో దోమలగూడ సీఐ డి.కృష్ణారెడ్డి, డీఐ వరప్రసాదరెడ్డి, సిబ్బందిలు పాల్గొన్నారు.

కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వమే..


నల్లకుంటలో ప్రచారం చేస్తున్న వనం రమేష్

నల్లకుంట: నరేంద్ర మోదీ ప్రభుత్వమే మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని నల్లకుంట మాజీ కార్పొరేటర్, బీజేపీ సీనియర్ నేత వనం రమేష్ అన్నారు. బుధవారం నల్లకుంట డివిజన్ బూత్ నంబర్ 10 పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి జి.కిషన్ రెడ్డికి మద్దతుగా బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వనం రమేష్ మాట్లాడుతూ కిషన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. 'నరేంద్ర మోదీ గ్యారంటీలు.. కిషన్ రెడ్డి షూరిటీ' అంటూ ఈ సందర్భంగా నినాదాలు చేశారు. ఈ ప్రచారంలో బీజేపీ నాయకులు వనం మాలతి, నిఖిల్, నబిత, వీరన్న, రమ, రాహుల్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం.చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి(50) కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం నెంబర్ 1 చివరన పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.